

ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## ఐలమ్మ పోరాటం.. స్ఫూర్తిదాయకం

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ అర్బన్, సెప్టెంబర్ 10 : దొరల పెత్తనాన్ని ఎదురించి రజాకార్లను తరిమికొట్టిన వీర వనిత చాకలి ఐలమ్మ అని, ఆమె పోరాటం నేటి సమాజానికి స్ఫూర్తి దాయకమని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పద్మావతికాలనీ గ్రీన్‌బెల్ట్‌లో ఐలమ్మ 39వ వర్ధంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ పోరాటానికి దారి చూపి భూమి, భుక్తి, విముక్తి కోసం తెలంగాణ ప్రజల తెగువను, పౌరుషాన్ని ప్రపంచానికి చాటిన ధీరశాలి ఐలమ్మ అని కొనియాడారు. తెలంగాణ మట్టిలోనే పోరాటం ఉందని చాటి చెప్పిన ఐలమ్మ జీవితం నేటి తెలంగాణ ప్రజానీకానికి ఆదర్శమన్నారు. గత ప్రభుత్వంలోనే ఐలమ్మ జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించామని, హైదరాబాద్‌లో ఐలమ్మ స్మృతి భవనానికి ఎకరా స్థలం కేటాయించినట్లు చెప్పారు. ఐలమ్మలాంటి మహనీయుల చరిత్రను భావితరాలకు గుర్తుండేలా పట్టణంలోని గ్రీన్‌బెల్ట్‌లో ఆమె విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు.

కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, ముడా మాజీ చైర్మన్ వెంకటయ్య, కౌన్సిలర్లు గణేశ్, రవికిషన్, రాము, నాయకులు శివరాజ్, నవకాంత్, సతీశ్, సుధాకర్, రజక సంఘం నాయకులు పురుషోత్తం, మల్లేశ్, దశరథ్ పాల్గొన్నారు.



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

## ముంపు గ్రామాల ప్రజలను ఆదుకోవాలి

- మంత్రి ఉత్తమ్‌ను కలిసిన మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే బండ్ల

గద్వాల, సెప్టెంబర్ 10 : ప్రస్తుతం కురుస్తున్న భారీవర్షాల కారణంగా గద్వాల నియోజకవర్గంలోని చిన్నోనిపల్లి, నాగర్‌దొడ్డి గ్రామాలు పూర్తిగా నీట మునిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారికి ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి హైదరాబాద్‌లో ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. భారీ వర్షాల వల్ల వారికి పునరావాసం లేక ప్రజలు అక్కడే నివసిస్తున్నారని వీరు ఆర్‌ఆర్ సెంటర్‌కు వెళ్లి నివసించడానికి అక్కడ మౌలిక సదుపాయాలు కల్పించాలని మంత్రిని కోరారు. ముంపు ప్రాంతాల నుంచి ఆర్‌ఆర్ సెంటర్‌కు తరలుతున్న ప్రజలకు అత్యవసర సాయం అందజేయాలన్నారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి వారిని ఆదుకోవాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.



కొండారెడ్డిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కలెక్టర్‌తో కలిసి మొక్క నాటి నీళ్లు పోస్తున్న సీఎండీ ఫరూఖీ

## సోలార్ గ్రామంగా తీర్చిదిద్దాలి

- పైలట్ ప్రాజెక్టుగా కొండారెడ్డిపల్లి గ్రామం ఎంపిక
- టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషరఫ్ అలీ ఫరూఖీ

వంగూరు, సెప్టెంబర్ 10 : కొండారెడ్డిపల్లిని పూర్తి సోలార్ విద్యుత్ గ్రామంగా తీర్చిదిద్దాలని టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషరఫ్ అలీ ఫరూఖీ అధికారులను ఆదేశించారు. సోలార్ విద్యుత్ ప్రాజెక్టుగా మండలంలోని కొండారెడ్డిపల్లి గ్రామాన్ని ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా ప్రకటించడంతో మంగళవారం సీఎండీ ఫరూఖీ, కలెక్టర్ సంతోష్ గ్రామానికి వచ్చి సర్వే చేసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. అంతకుముందు సబ్‌స్టేషన్‌లో కలెక్టర్ సంతోష్‌తో కలిసి సీఎండీ ఫరూఖీ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎండీ మాట్లాడుతూ పైలట్ ప్రాజెక్టు ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్లు నెలకొల్పి గృహ, వాణిజ్య విద్యుత్ అవసరాలతోపాటు రైతులకు ఉచితంగా సోలార్ పంపు సెట్లను అందించాలని ప్రణాళిక రూపొందించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్‌ను వినియోగించుకునే ప్రయత్నంలో భాగంగా పైలట్ ప్రాజెక్టు కింద కొండారెడ్డిపల్లి, ఖమ్మం జిల్లాలో మరో గ్రామాన్ని ఎంపిక చేసిందన్నారు. ఇందులో భాగంగా గ్రామంలో వారంపాటు పర్యటించి ప్రజలు, రైతులు, వ్యాపారుల అభిప్రాయాలను సేకరిస్తారన్నారు. కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ గృహ, రైతుల వ్యవసాయ, వాణిజ్య అవసరాల కోసం సోలార్‌ను వినియోగించడం ద్వారా విద్యుత్‌ను ఆదా చేయొచ్చన్నారు. అనంతరం గ్రామంలో అభిప్రాయాలను సేకరించారు. కార్యక్రమంలో రెడ్‌కో ఎండీ అనీలా, సెర్ప్ డైరెక్టర్ కృష్ణ, అదనపు కలెక్టర్ దేవసహాయం, జేడీ రమేశ్, మాజీ జెడ్పీటీసీ కేవీఎన్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**విద్యుత్ అధికారులతో సమీక్ష**

కల్వకుర్తి రూరల్, సెప్టెంబర్ 10 : కల్వకుర్తి తాసీల్దార్ కార్యాలయంలో ట్రాన్స్‌కో సీఎండీ ముషరఫ్ అలీ ఫరూఖీ, కలెక్టర్ సంతోష్ ట్రాన్స్‌కో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ నిర్ణీత గడువులోగా పైలట్ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కల్వకుర్తి ఆర్డీవో రాజేశ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.



అచ్చంపేటలోని వినాయక మండపంలో శాంతిహోమం నిర్వహిస్తున్న చిన్నారులు

## వరుణదేవా.. శాంతించు

- రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు సుభిక్షంగా ఉండాలి
- వరుణ శాంతి హోమం నిర్వహించిన చిన్నారులు

అచ్చంపేటటౌన్, సెప్టెంబర్ 10 : పట్టణంలోని పలు కూడళ్లు, ఆలయాల్లో ఏర్పాటు చేసిన గణనాథుడి ప్రతిమలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని పాత బజారులో ఏర్పాటు చేసిన వినాయడికి ఎదుట మంగళవారం ఉమామహేశ్వర భజన బృందంతో ఏర్పాటు చేసిన మహిళల భజన కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయి. అదేవిధంగా తెలుగు రాష్ట్రాలో వర్షాలు అధికంగా కురిసి వరదలు ముంచెత్తడంతో వరుణదేవుడు శాంతించాలని కోరుతూ చిన్నారులు మండపం ఎదుట విద్యా గణపతి హోమం, లక్ష్మీ గణపతి హోమం, వరుణశాంతి హోమం నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో చిన్నారులు వెంకి, విగ్నేశ్, అనిరుధ్, అర్జున్, కార్తీక్, మహేశ్, సన్నీ, భ్రమరాంబ కిట్టిపార్టీ మహిళలు పాల్గొన్నారు.



చిన్నోనిపల్లిలో వివరాలు సేకరిస్తున్న అధికారులు

## చిన్నోనిపల్లిలో అధికారుల తిష్ట

గట్టు, సెప్టెంబర్ 10 : చిన్నోనిపల్లిలో అధికారులు రెండో రోజూ మకాం వేశారు. గట్టు తాసీల్దార్ సరితారాణి, ఇతర మండలాల తాసీల్దార్ల ఆధ్వర్యంలో అధికారులు పర్యటించి పునరావాస కేంద్రంలో వసతుల కల్పన, మౌలిక సౌకర్యాల గురించి విచారించారు. కాగా, ముంపు గ్రామంలో ఉన్న ఇండ్ల యజమానుల నుంచి వివరాలు సేకరించారు. ఇబ్బందులున్న ప్లాట్ల సమస్యలను పరిష్కరించారు. విద్యుత్, మిషన్ భగీరథ అధికారులు విద్యుత్ స్తంభాలు, తాగునీటి సరఫరా కోసం పైప్‌లైన్ పనులు చేపట్టారు.



మన్ననూర్ దవాఖాన ఎదుట చికిత్స కోసం ఎదురుచూస్తున్న రోగులు

# వైరల్ వణుకు

## మంచం పట్టిన నల్లమల!

- విష జ్వరాలతో ప్రజలు విలవిల
- ప్రభుత్వ దవాఖానలకు పరుగులు
- సత్ఫలితాలివ్వని మొబైల్ చికిత్సలు
- నిరుపయోగంగా మన్ననూర్ టీహబ్
- నిలిచిన న్యూట్రీషియన్ కిట్లు
- పోషకాహార లోపంతో చెంచులు
- ప్రైవేట్ వైద్యశాలల వైపు మొగ్గు

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ) : నల్లమలకు వైరల్ ఫీవర్ పట్టుకున్నది. వానకాలం రావడంతో చాలా మంది వైరల్ ఫీవర్‌తో దవాఖానలకు పరుగులుపెడుతున్నారు. ప్రభుత్వ దవాఖానలున్నా చాలా మంది ప్రైవేట్, స్వచ్ఛంద సంస్థల ఆసుపత్రుల వైపే మొగ్గుచూపుతున్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖ మొబైల్ అంబులెన్స్ సేవలు ఉన్నా వారికి నమ్మకం కలిగించడం లేదు. మూడు నెలల ముందు నుంచే అటవీ ప్రాంతాల్లోని ప్రజలు విష జ్వరాలతో బాధపడుతున్నారు.

**వేధిస్తున్న రక్తహీనత**

ఏజెన్సీల్లోని చెంచులను రక్తహీనత సమస్య వేధిస్తోంది. సరైన పోషకాహారం లేక బలహీనంగా మారుతున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేసీఆర్ న్యూట్రీషియన్ కిట్లను అందించగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అప్పటి వరకు ఉన్న కిట్లను పంపిణీ చేసిందే తప్పా కొత్తగా అందించలేదు. ఇది చెంచుల్లో పౌష్టికాహార లోపాన్ని పెంచుతున్నది. ఇక ప్రభుత్వ దవాఖానల్లో పరీక్షలు నిర్వహించి ఫలితాలు రావడంలో జాప్యం జరుగుతోంది. ఇక్కడి ప్రజలకు స్థానికంగానే పరీక్షల ఫలితాలు అందించేలా బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.90లక్షలతో నిర్మించి, నాటి మంత్రులు సత్యవతి రాథోడ్, శ్రీనివాస్‌గౌడ్, సింగిరెడ్డి, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు చేతుల మీదుగా ప్రారంభించిన టీ హబ్ నిరుపయోగంగా మారింది. ప్రారంభానికే పరిమితం కావడంతో వైద్య పరీక్షల ఫలితాల వెల్లడిలో జాప్యం జరుగుతోంది. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి రక్త, మూత్ర, ఇతర పరీక్షల శాంపిళ్లను పంపించి, ఫలితాలు వచ్చేలోపు రోజులు పడుతోంది. అప్పటి వరకు ప్రజలకు అనారోగ్య సమస్య తీవ్రత పెరుగుతోంది. మన్ననూర్‌లోని ప్రభుత్వ వైద్యశాలలో సింగిల్ డిజిట్‌లోనే ప్రజలు చికిత్సలు తీసుకుంటుండగా అదే అక్కడి స్వచ్ఛంద సంస్థలు ఆర్డీటీ, అపోలో దవాఖానల వద్ద మాత్రం బారులు తీరారు. ఇక్కడి వైద్యశాలతో పోలిస్తే స్వచ్ఛంద సంస్థల వద్ద పెద్ద సంఖ్యలో ప్రజలు చికిత్సకు మొగ్గుచూపుతున్నారు. చాలా మంది ఇన్‌పేషెంట్లుగా చికిత్సలు తీసుకుంటున్నారు. సరైన వసతులు లేకున్నా ఆరుబయటే పడుకొని చికిత్సల కోసం ఎదురు చూస్తూ కనిపించారు. ప్రభుత్వ దవాఖానల్లో ఇచ్చే వైద్యం, మందులపై ఇక్కడి ప్రజలు నమ్మకం కోల్పోవడం వల్లే ఇలా ప్రైవేట్ వైపునకు పరుగులు పెడుతున్నారు. కొద్దిగా డబ్బులు ఖర్చయినా సరే.. ఆరోగ్యం బాగుపడితే చాలని అంటుండడం ప్రభుత్వ దవాఖానలపై అపనమ్మకాన్ని చాటుతోంది. ప్రభుత్వం, జిల్లా వైద్యారోగ్య శాఖ ఏజెన్సీ ఏరియాల్లో ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు నిర్వహించి ప్రభుత్వ వైద్యంపై నమ్మకం కల్పించడంతోపాటు అవసరమైన మందులు అందించాల్సి ఉన్నది.

### వైద్య సేవలందిస్తున్నాం..



ప్రభుత్వ దవాఖానలో రోజూ చికిత్సలు, మందులు ఇస్తున్నాం. అవసరమైతే గ్లూకోజ్‌లు కూడా ఎక్కిస్తున్నాం. రోజూ మూడు అంబులెన్స్‌లు చెంచు పెంటల్లో తిరుగుతున్నాయి. తొందరగా తగ్గుతుందనే అపనమ్మకంతో బయట దవాఖానలకు వెళ్తున్నారు. ఈసారి వైరల్ ఫీవర్లతోనే ఎక్కువగా ప్రజలు ఆస్పత్రులకు వస్తున్నారు.

- డాక్టర్ గౌతమ్, మన్ననూర్ పీహెచ్‌సీ



మన్ననూరు దవాఖానలో చికిత్స పొందుతున్న రోగులు


### ఏజెన్సీలో హడల్

నాగర్‌కర్నూల్ జిల్లాలో వైరల్ ఫీవర్ బెంబేలెత్తిస్తోంది. వర్షాకాలం కావడంతో ఏజెన్సీ ఏరియాలోని చాలా మంది వైరల్ ఫీవర్ బారిన పడుతున్నారు. జిల్లాలోని అమ్రాబాద్, పదర, లింగాల తదితర ప్రాంతాల్లోని ఏజెన్సీ ఏరియా ప్రజలకు సీజనల్‌గా వ్యాపించే వైరల్ ఫీవర్ ప్రభావం చూపుతోంది. చాలామంది చలి, జ్వరం, ఒళ్లు నొప్పులు, నీరసానికి గురవుతున్నారు. గత నెల రోజుల నుంచి భారీగా వర్షాలు పడుతుండడంతో అటవీ ప్రాంతాల్లో సహజంగా విషజ్వరాల ప్రభావం ఎక్కువగా ఉంటోంది. అయితే, డెంగీ, మలేరియా కేసులు మాత్రం నమోదు కాకపోవడం గమనార్హం. కాగా ప్రభుత్వ దవాఖానల్లో వైద్య సేవలు అందిస్తున్నా చాలా మంది ప్రైవేట్, స్వచ్ఛంద సంస్థల ఆసుపత్రులకు వెళ్లేందుకే మొగ్గుచూపుతున్నారు. మూడు మొబైల్ అంబులెన్స్‌లు రోజూ రెండు చెంచు పెంటల్లో సేవలు అందిస్తున్నాయి. అయితే ఆయా దవాఖానల్లో అందించే సేవలపై ప్రజలకు నమ్మకం కలగడం లేదు. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకపోవడం, ఇటీవల ప్రత్యేకాధికారులు బదిలీ కావడంతో పల్లెల్లో పారిశుధ్యం, పాలన పూర్తిగా అటకెక్కింది. దీనివల్ల అధికారులు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టలేక పోతున్నారు. ఈ కారణంగా సాధారణ గ్రామాలు, పట్టణాల్లోనే వైరల్ ఫీవర్లు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుండటం విశేషం. ఇది అటవీ ప్రాంతాల ప్రజలకు మరింత ఇబ్బంది కలిగిస్తోంది. ఏజెన్సీ పరిధిలోని లింగాల, అమ్రాబాద్ వటువర్లపల్లి, పదర, ఈగలపెంట, దోమలపెంట, మన్ననూర్, తదితర దవాఖానల్లో రోజూ 60 నుంచి 80 మంది చొప్పున ప్రజలు ఔట్ పేషెంట్‌గా చికిత్స తీసుకుంటున్నారు. ఇలా ఏజెన్సీ పరిధిలో రోజూ 300 నుంచి 400 మంది వరకు దవాఖానలకు వస్తున్నారు.

## అశ్రునయనాల మధ్య అంతిమయాత్ర

- లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతకు కన్నీటి వీడ్కోలు
- మాజీ మంత్రులు హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, మంత్రి జూపల్లి, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేల పరామర్శ
- శోకసంద్రంలో ఆవంచ





నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, ఆవంచలో మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు

తిమ్మాజీపేట, సెప్టెంబర్ 10 : అనారోగ్యంతో మృతి చెందిన మాజీ మంత్రి చర్లకోల లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతాలక్ష్మారెడ్డి అంత్యక్రియలు మంగళవారం మండలంలోని ఆవంచలో నిర్వహించారు. మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో శ్వేతాలక్ష్మారెడ్డి భౌతికకాయాన్ని లక్ష్మారెడ్డి స్వగ్రామమైన ఆవంచకు తీసుకొచ్చారు. లక్ష్మారెడ్డి స్థానికులను చూసి బోరున విలపించారు. వేలాది మంది అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆమె మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. సాయంత్రం ఐదు గంటల తర్వాత ఆమె భౌతికకాయాన్ని వైకుంఠ రథంలో కొద్దిదూరం ఊరేగించారు. అనంతరం పాడెలో ఆమె భౌతికకాయాన్ని తరలించగా సతీమణి చితికి లక్ష్మారెడ్డి నిప్పుపెట్టారు. స్థానికులతోపాటు వేలాది మంది అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి అశ్రునయనాల మధ్య శ్వేతాలక్ష్మారెడ్డికి వీడ్కోలు పలికారు.

**లక్ష్మారెడ్డిని ఓదార్చిన ప్రముఖులు..**

మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతాలక్ష్మారెడ్డి భౌతికకాయానికి పలువురు ప్రముఖులు నివాళులర్పించి లక్ష్మారెడ్డిని పరామర్శించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి.. శ్వేతాలక్ష్మారెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం లక్ష్మారెడ్డిని హత్తుకొని ధైర్యం చెప్పారు. అదేవిధంగా మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, ఎమ్మెల్సీలు చల్లా వెంకట్రామిరెడ్డి, నవీన్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, రాజేశ్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, వాకిటి శ్రీహరి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, గువ్వల బాలరాజు, జైపాల్ యాదవ్, ఎర్ర శేఖర్, అంజయ్య యాదవ్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఎస్ రాజేందర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ధర్మారెడ్డి, మాజీ ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎర్రోళ్ల శ్రీనివాస్, ఇంతియాజ్‌ఇసాక్, రజినీ సాయిచంద్, నాగం శశిధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మర్రి సతీమణి మర్రి జమున, నాగర్‌కర్నూల్ మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పనా భాస్కర్ గౌడ్, మహబూబ్‌నగర్ జెడ్పీ మాజీ చైర్మన్ కోడ్గల్‌యాదయ్య, నాయకులు పరామర్శించారు.





లక్ష్మారెడ్డిని ఓదారుస్తున్న శ్రీనివాస్‌గౌడ్, ఆల, రాజేందర్‌రెడ్డి, చిట్టెం, అంతిమయాత్రలో మాజీమంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

## గంజాయిపై ఉక్కుపాదం

- అడ్డాగా ఉన్న ప్రాంతాల్లో దాడులు చేసి పూర్తిగా అరికట్టాం
- సారా, కల్తీకల్లు బాధితులు పాలమూరులోనే ఎక్కువ
- కృష్ణ, నందిన్నె చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచాలి
- రాష్ట్ర ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి




ఉమ్మడి జిల్లా అధికారులతో డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి, జాయింట్ కమిషనర్ ఖురేషీ

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 10 : గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం మోపామని, అడ్డాగా ఉన్న ధూల్‌పేటలో నెల రోజులుగా విస్తృతంగా దాడులు నిర్వహించి పూర్తిగా అరికట్టామని.., ఇక పాలమూరుపై ప్రత్యేక దృష్టి సారిస్తామని రాష్ట్ర ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీవీ కమలాసన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన జాయింట్ కమిషనర్ ఖురేషీతో కలిసి మాట్లాడారు. ధూల్‌పేట్‌లో నెల రోజులుగా దాడులు నిర్వహిస్తూ గంజాయి విక్రయదారులను చాలా మందిని జైలుకు పంపించామన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో నాటుసారా, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల నియంత్రణకు ఆయా జిల్లాల పోలీసు అధికారుల సమన్వయంతో ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ముందుకు సాగుతున్నారన్నారు. ఇందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ఇతర జిల్లాలతో పోలిస్తే డ్రగ్స్ వినియోగం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో తక్కువగా ఉన్నా.. నాటుసారా, కల్తీ కల్లు తాగడం వల్ల అనారోగ్యం పాలవుతున్న కుటుంబాలు ఈ జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్నాయని అన్నారు. వాటిని పూర్తిగా కంట్రోల్ చేయడానికి ఎక్సైజ్ యంత్రాంగం అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ముఖ్యంగా ఇతర రాష్ట్రాల నుంచి మద్యం రాకుండా అడ్డుకోవడానికి కృష్ణ, నందిన్నె చెక్‌పోస్టుల్లో నిఘా పెంచామని వివరించారు.

**ఎక్సైజ్‌శాఖకు మంచిపేరు తేవాలి..**

ఉమ్మడి పాలమూరు జిల్లాలో నాటుసారా, కల్తీకల్లును పూర్తిగా అరికట్టి ఎక్సైజ్ శాఖకు మంచిపేరు తేవాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి సూచించారు. మంగళవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగుళాంబ గద్వాల, నారాయణపేట జిల్లాల్లో ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డ్రగ్స్, మత్తు పదార్థాల రవాణాపై పూర్తిస్థాయిలో నిఘా పెంచాలని సూచించారు. సారా, కల్తీకల్లు తయారీకి వినియోగిస్తున్న బెల్లం, ఆలం, ఆల్ప్రాజోలం వంటి వాటిపై దృష్టి సారించి పూర్తిస్థాయిలో కట్టడి చేయాలన్నారు. నియమ నిబంధనలకు విరుద్ధంగా జరిగే ప్రతిదాన్ని ఉక్కుపాదంతో అణిచివేయాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కమిషనర్ ఖురేషీ, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ విజయభాస్కర్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఈఎస్ గాయత్రి, అధికారులు పాల్గొన్నారు.

## దెబ్బతిన్న పైపులైన్

- 15 రోజులుగా తాగునీటి సరఫరా బంద్

మాగనూరు, సెప్టెంబర్ 10 : ఉమ్మడి మాగనూర్ మండలానికి తాగునీటిని సరఫరా చేసే పైపులైన్ 15 రోజుల కిందట దెబ్బతిన్నది. దీంతో 12 గ్రామాలకు నీటి సరఫరా నిలిచి పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మాగనూర్ పెద్దవాగు ఉధృతంగా ప్రవహించడంతో 15 రోజుల కిందట మాగనూరు, కృష్ణ మండలాలకు భగీరథ నీటిని సరఫరా చేసే పైపులైన్ దెబ్బతిన్నది. ఈ విషయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా కన్నెత్తి చూడడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి మరమ్మతులు చేసి నీటి ఎద్దడి తీర్చాలని ఉమ్మడి మండల ప్రజలు కోరుతున్నారు.



మాగనూరు పెద్దవాగులో దెబ్బతిన్న పైపులైన్